మౌలిక వసతుల మెరుగెప్పుడు?

- ఏడాది గడిచినా ప్రారంభం కాని మన ఊరు–మన బడి పనులు
- టెండర్ పిలిచినా ముందుకు రాని కాంట్రాక్టర్లు
- రెంజర్ల ఉన్నత పాఠశాలలో దుస్థితి



ముప్కాల్ మండలం రెంజర్ల ఉన్నత పాఠశాలలో ప్రశాంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన శిలాఫలకం



గదులు నిర్మించటానికి ఉన్న గదులను కూలగొట్టిన దృశ్యం

బాల్కొండ: సర్కార్ బడుల్లో మౌలిక వసతులు మెరుగు పరచటం కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మన ఊరు– మన బడి పనులు ఇంకెప్పుడు చేపడుతారంటూ విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. పనులను గత విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని ఉన్నత అధికారులు పలు మార్లు ఆదేశాలిచ్చారు. కానీ ప్రస్తుత విద్యాసంవత్సరంలో బడులు ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా ఇటుక పడలేదు. ప్రధానంగా మన ఊరు– మన బడిలో రూ.10 లక్షల లోపు ఉన్న పనులను టెండర్ లేకుండా ఎస్సెమ్సీ కమిటీల ద్వారా పనులు చేపట్టారు. కాని ఎటొచ్చి టెండర్ ద్వారా నిర్వహించే పనులకే అతీ గతీ లేకుండా పోయింది. బాల్కొండ మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ.1.5 కోట్లు, వన్నెల్(బి) ఉన్నత పాఠశాలకు రూ.88 లక్షలు, ముప్కాల్ మండలంలో రెంజర్ల ఉన్నత పాఠశాలకు రూ.కోటి, ప్రాథమిక పాఠశాలకు రూ.34.6 లక్షలు, వేంపల్లి ప్రాథమిక పాఠశాలకు రూ.45 లక్షలు, ముప్కాల్ ఉన్నత పాఠశాలకు రూ.98 లక్షలు, మెండోరా మండలంలో సావెల్ ఉన్నత పాఠశాలకు రూ.35 లక్షలు మంజూరయ్యాయి. మెండోరా మండలంలో పోచంపాడ్‌లో ఉన్నత పాఠశాలకు రూ.1.5 కోట్లు, ప్రాథమిక పాఠశాలకు రూ.35 లక్షలు, ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలకు రూ.28 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేయగా, ఈ పాఠశాలల పనులు మాత్రం టెండర్ పూర్తయ్యాయి. పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి. కాని మిగతా పాఠశాలల పనులకు ఇప్పటికీ టెండర్ కాలేదు. ఇది వరకే నాలుగు సార్లు టెండర్ పిలిచినా ఎవరు కూడా ముందుకు రావడం లేదు. ప్రభుత్వ పనులు చేపట్టలంటే కాంట్రాక్టర్లు జంకుతున్నారు. పాత ఎస్ఎల్ఆర్ ధరల ప్రకారం నిధులు మంజూరు చేయడం ద్వారా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు సార్లు టెండర్ పిలిచినా ఒక్కరు కూడా టెండర్ దాఖలు చేయలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పాలకులు, ఉన్నత అధికారులు స్పందించి వెంటనే టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

టెండర్ దాఖలు కావడం లేదు

మన ఊరు– మన బడిలో చేపట్టాల్సిన పనుల కోసం నాలుగు సార్లు టెండర్ పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు. ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పోచంపాడ్ పాఠశాలలో టెండర్లు దాఖలై పనులు కొనసాగుతున్నాయి.

– బట్టు రాజేశ్వర్, ఎంఈవో, బాల్కొండ

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

- 2 వేల మందికి పైగా హాజరైన అభ్యర్థులు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఇందూర్ మోడల్ పాఠశాలలో ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన వచ్చింది. ఈ జాబ్ మేళాకు 82 కంపెనీలు రాగా 2 వేల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. జాబ్ మేళాకు హాజరైన ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతీ విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ముందుకు సాగాలని, లక్ష్య సాధనకు తపన, కృషి ఉండాలని అప్పుడే లక్ష్య సాధన సాధ్యమవుతుందన్నారు. మంచి చదువు మంచి భవిష్యత్తును అందిస్తుందని, జాబ్ మేళాలో పాల్గొనే ప్రతీ ఒక్కరు ఉద్యోగం సంపాదించాలని ఆకాంక్షించారు.



కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆగస్టు 10న జాతీయ కంపెనీలతో ..

ఆగస్టు 10న బోధన్‌లో జాతీయ కంపెనీతో మరో జాబ్ మేళా నిర్వహిస్తామని, మేళాకు 500 కంపెనీలు హాజరవుతాయని, విద్యార్థులు సన్నద్ధం కావాలన్నారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగారాం,కౌన్సిలర్‌లు దూప్‌సింగ్, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడి పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రమాదవశాత్తూ మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున ప్రమాద బీమా చెక్కులను మంత్రి వారి కుటుంబాలకు మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త ఇంటికి సీఎం కేసీఆర్ పెద్దదిక్కులా ఉంటారని స్పష్టం చేశారు. వేల్పూర్, ఏర్గట్ల, ముప్కాల్, కమ్మర్‌పల్లి మండలాలకు చెందిన నలుగురు కార్యకర్తల కుటుంబాలకు బీమా చెక్కులు అందజేశారు.



నిధుల మంజూరు కాపీల అందజేత

వేల్పూర్: బాల్కొండ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు రూ. 2.71 కోట్లతో 17 నూతన దేవాలయాలకు మంజూరైన నిధుల ఉత్తర్వు కాపీలను మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మంగళవారం ఆయా గ్రామాల నేతలకు అందజేశారు. బీఆర్ఎస్ నేతలు, దేవాలయ కమిటీ, వీడీసీల సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సెంట్రల్ లైటింగ్‌కు నిధుల మంజూరు

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ కోసం రూ.12 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మచ్చర్ల సాగర్ తెలిపారు. నందిపేటలోని వివేకానంద చౌరాస్తా నుంచి పెద్ద మజీద్ వరకు నాలుగు లైన్ల రోడ్డుతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కోసం నిదులు మంజూరు చేస్తూ రోడ్లు భవనాల శాఖ నుంచి జీవో విడుదలైనట్లు తెలిపారు.

పాఠశాలకు మెమో జారీ

పెర్కిట్(ఆర్మూర్): యాప్‌ల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణల మేరకు ఆర్మూర్ పట్టణానికి చెందిన శ్రీ చైతన్య పాఠశాలకు ఎంఈవో రాజ గంగారాం మంగళవారం మెమో జారీ చేశారు. యాప్‌ల పేరుతో పాఠశాల ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.1,500 వసూలు చేస్తున్నారని విద్యార్థి సంఘాలు ఎంఈవో రాజ గంగారాంకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈవో వివరణ కోరుతూ పాఠశాలకు మెమో జారీ చేశారు. యాప్‌ల పేరుతో ఫీజులు వసూలు చేస్తే విద్యార్థుల తల్లిదండ్రులు చెల్లించవద్దని ఎంఈవో విజ్ఞప్తి చేశారు.

స్వామి వివేకానంద వర్ధంతి

కమ్మర్‌పల్లి: చౌట్‌పల్లి గ్రామంలో స్వామి వివేకానంద వర్ధంతి పురస్కరించుకొని ఆయన విగ్రహానికి మంగళవారం స్థానిక వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కొమ్ముల రవీందర్ ,సాయికుమార్, అనిరుధ్, ధర్మేందర్, వీడీసీ సభ్యుడు మేర నారాయణ, డాక్టర్ సాయిప్రసాద్, గణేష్ పాల్గొన్నారు.

నోట్ బుక్కుల పంపిణీ

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం పీఆర్‌టీయూ రాష్ట్ర నేత వరలక్ష్మి తన సొంత ఖర్చులతో నోట్‌బుక్కులు, పెన్నులను పంపిణీ చేశారు. నందిపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గోపాల్, పీఆర్‌టీయూ నేత కిషన్, హెచ్ఎం రమాదేవి పాల్గొన్నారు.

నవీపేటలో..

నవీపేట: మండల కేంద్రంలోని నవీపేట, ధర్యాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు అభ్యుదయ గ్రామీణ వికాస సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత అచ్చు పుస్తకాలు, పటాల పుస్తకాలను అందజేశారు. హెచ్ఎం భాగేందర్, హేమలత, అభ్యుదయ గ్రామీణ వికాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్మూర్ పట్టణంలో ప్లేట్లు..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని శాస్త్రీనగర్‌లో గల ప్రభుత్వ షెడ్యూల్డు కులాల బాలికల వసతి గృహంలో మంగళవారం విద్యార్థులకు పుస్తకాలు, ప్లేట్లు, గ్లాసులను జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ అధికారి శశికళ అందజేశారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

క్విజ్ పోటీల్లో మాక్లూర్ విద్యార్థుల ప్రతిభ

మాక్లూర్: ఆర్థికంగా వెనుకబడి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు మంగళవారం నిజామాబాద్ నగరంలో ఆర్‌బీఐ నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో మాక్లూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. పదోతరగతి చదువుతున్న ఆకాంక్ష, హర్షిత జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో పాల్గొనగా మూడవ బహుమతిని అందుకున్నారు. వీరికి నగదు కూడా అందజేశారు.

సోయా పంట పరిశీలన

రెంజల్(బోధన్): కందకుర్తిలో రైతులు వేసిన సోయా పంటను మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ పరిశీలించారు. గ్రామంలో సుమారు 800 ఎకరాల వరకు రైతులు సోయాలను విత్తుకున్నారని మండల వ్యవసాయాధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి ఆయనకు వివరించారు. సకాలంలో వర్షాలు లేక సోయా పంట మొలకెత్తడంలేదని తిరుమల ప్రసాద్ పేర్కొన్నారు. ఆయన వెంట బోధన్ ఇంచార్జి ఏడీవో సంతోష్ పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

వర్ని/రుద్రూర్: గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులందరినీ పర్మినెంట్ చేసి, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ, ఈనెల 6 నుంచి కార్మిక సంఘాల జేఏసీ తలపెట్టిన రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ , ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేశ్ వేర్వేరుగా పిలుపునిచ్చారు. మంగళవారం వర్ని మండల కేంద్రంలో సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. బుడ్డక్కల సాయిలు, సాయి చరణ్, గంగామణి, సాయవ్వ, చిన్నసాయిలు తదితరులున్నారు.

మండల లీగల్ సర్వీసెస్ కమిటీకి న్యాయవాదుల ఎంపిక

ఆర్మూర్‌టౌన్: ఉచిత న్యాయ సేవలు అందించే ఆర్మూర్ మండల లీగర్ సర్వీసెస్ కమిటీకి న్యాయవాదులు మంగళవారం ఎంపికయ్యారు. ఆర్మూర్ కోర్టు న్యాయవాదులు తుమ్మ సుకేష్, మామిడి రాజేశ్వర్, తాళ్ల శ్రీనివాస్, కుందారం శ్రావణ్, కొండి పవన్ కుమార్ కమిటీలో సభ్యులుగా ఎంపికయ్యారు. వీరు 3 సంవత్సరాలు లీగల్ సర్వీసెస్ కమిటీ ద్వారా న్యాయసేవలు అందించనున్నారు.

రైతుల్ని పట్టించుకోకపోవడం విచారకరం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్ రెడ్డి

ఎడపల్లి(బోధన్): వారం రోజులుగా సమస్య పరిష్కారం కోసం రైతులు ఆందోళన చేస్తుంటే స్థానిక ఎమ్మెల్యే షకీల్ పట్టించుకోకపోవడం విచారకరమని బీజేపీ నేత వడ్డీ మోహన్ రెడ్డి అన్నారు. రెంజల్ మండల కేంద్రం నుంచి బ్రాహ్మణపల్లి బైపాస్, దూపల్లి బైపాస్ వరకు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనా ఇంతవరకు రోడ్ల నిర్మాణం చేపట్టడం లేదని నిరసిస్తూ రెంజల్ రైతులు సాటాపూర్ గేట్ వద్ద నిజామాబాద్– బోధన్ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. వీరి ఆందోళనకు బీజేపీ నేత వడ్డీ మోహన్ రెడ్డితో పాటు నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆందోళన విరమింప చేయాల్సిన ఎమ్మెల్యే రైతులను పట్టించుకోకుండా సమస్యను జఠిలం చేస్తున్నారని విమర్శించారు. రైతులు రాస్తారోకో చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న బోధన్ రూరల్ సీఐ శ్రీనివాసరాజు ఘటనా స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు. బీజేపీ నాయకులు శ్రీధర్, సుర కిరణ్, సర్పంచ్‌లు ఇంద్రకరణ్, సాయిలు, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ఎడపల్లి(బోధన్): బీజేపీ ఆధ్వర్యంలో మండలంలో మంగళవారం బైక్ ర్యాలీ చేపట్టారు. మహాజన సంపర్క్ సమర్థన్ ముగింపు కార్యక్రమంలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. జానకంపేట నుంచి ఏఆర్‌పీ క్యాంప్ మీదుగా సాటాపూర్ గేటు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నేత వడ్డీ మోహన్ రెడ్డి హాజరై బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు కమలాకర్ రెడ్డి, బోధన్ అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు మద్దతుగా మాట్లాడుతున్న మోహన్ రెడ్డి

నవీపేటలో..

నవీపేట: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలపై బీజేపీ నేత వడ్డీ మోహన్ రెడ్డి, విస్తారకులు ఆర్‌కే మణివన్నన్, అజిత్ దాస్ జైన్‌లు మంగళవారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు బీజేపీ కంకణం కట్టుకుందని, రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన



రుద్రూర్: రాణంపల్లి, సులేమన్‌నగర్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం జెడ్పీటీసీ నరోజి గంగారాం, బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న జీపీ భవనం, హెల్త్ సబ్ సెంటర్, స్కూల్ భవనం, సీసీ రోడ్లను పరిశీలించి నాణ్యతతో చేపట్టాలని సూచించారు. రాణంపల్లి క్యాంపు నుంచి గ్రామం వరకు బీటీ రోడ్డు పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్‌లు షేక్ ఖాదర్, రోజా లక్ష్మణ్, రైతుబంధు కన్వీనర్ తోట సంగయ్య, విండో మాజీ చైర్మన్ పత్తి రాము, బీఆర్ఎస్ నేతలు పత్తి లక్ష్మణ్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

బోగస్ ఓటర్లను తొలగించాలి



బోధన్: పట్టణంలోని 38 వార్డుల్లో ఓటరు జాబితా నుంచి బోగస్ ఓటర్లను తొలగించాలని కోరుతూ మంగళవారం స్థానిక ఆర్డీవో రాజేశ్వర్‌కు కాంగ్రెస్ పట్టణ నాయకులు వినతి పత్రం అందించారు. సుమారు 15 వేల బోగస్ ఓటర్లు ఉంటారని పేర్కొన్నారు. సమగ్ర విచారణ చేపట్టాలని తెలిపారు. పట్టణ విస్తరణ, పెరిగిన జనాభా వల్ల కొత్త కాలనీలు ఏర్పడ్డ నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు ఓటర్లకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నేతలు పాషా మోహినొద్దీన్, హరికాంత్ చారి,దాము, నవీన్, కలీమ్ పాల్గొన్నారు.

మంత్రి పుట్టిన రోజు వేడుకలు

భీమ్‌గల్: మండలంలోని ఐకేపీ కార్యక్రమంలో మంగళవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. సెర్ప్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుంట గంగాదర్, ఏపీఎం కుంట శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. సెర్ప్ సిబ్బందికి పే స్కేల్ వర్తింపజేయడంలో మంత్రి ఎర్రబెల్లి కీలక పాత్ర పోషించారని తెలిపారు.

సమాచారం..

నేడు పోతంగల్‌లో స్పీకర్ పర్యటన

రుద్రూర్: పోతంగల్ మండలంలోని కొల్లూర్, దోమలెడ్గి గ్రామాల్లో బుధవారం అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పర్యటిస్తారని స్థానిక ప్రజాప్రతినిధులు తెలిపారు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేస్తారని వారు పేర్కొన్నారు.

దొడ్డి కొమరయ్యకు ఘన నివాళులు

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య వర్ధంతిని జిల్లాలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల కోసం ఆయన పోరాడిన తీరును వామపక్ష నేతలు గుర్తు చేశారు. కొమరయ్య ఆశయ సాధనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. – సాక్షి నెట్‌వర్క్



ఆర్మూర్‌టౌన్: దొడ్డి కొమరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



ఆర్మూర్ పట్టణంలో.. ప్రజాపంథా నాయకులు



బోధన్‌లో ..ప్రజాపంథా నేతలు

ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం నిరాకరణ

ఆర్మూర్‌టౌన్: ప్రసవం కోసం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన గర్భిణీకి వైద్యం చేయకుండా ప్రైవేటు ఆస్పత్రికి పంపిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామానికి చెందిన గర్భిణీని సోమవారం రాత్రి ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. మంగళవారం మధ్యాహ్నం వరకు ఆస్పత్రిలో ఉంచుకున్న వైద్యులు పేషంట్ పరిస్థితి విషమంగా ఉందని నిజామాబాద్‌కు తరలించాలని సూచించారు. దీంతో ఉలికిపడ్డ కుటుంబ సభ్యులు హుటాహుటిన పెర్కిట్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ మగ శిశువుకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డలు క్షేమంగా ఉన్నారు. పరిస్థితి విషమంగా ఉందన్న నెపంతో ప్రభుత్వ ఆస్పతి వైద్యులు ప్రసవం చేయలేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఒక వేళ పరిస్థితి విషయమంగా ఉంటే ప్రైవేటు ఆస్పత్రిలో తల్లి, బిడ్డలు ఎలా క్షేమంగా ఉంటారని ప్రశ్నించారు. రక్తం తక్కువగా ఉండటంతో నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి సిఫారసు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ వివరణ ఇచ్చారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన



రెంజల్ (బోధన్): రహదారి భద్రత ఉద్యమంలో భాగంగా సాటాపూర్‌లో మంగళవారం పోలీసులు ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. డ్రైవర్‌లు సెల్ ఫోన్ మాట్లాడుతూ అతివేగంగా నడపవద్దని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దని అన్నారు. లేదంటే చర్యలు తీసుకుంటామని రెంజల్ ఎస్సై సాయన్న హెచ్చరించారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

ఆర్మూర్‌టౌన్: మధ్యంతర భృతి ప్రకటించి వెంటనే పీఆర్సీ కమిటీని నియమించాలని డిమాండ్ చేస్తూ ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్రభుత్వ పెన్షనర్లు మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్యాలయం సిబ్బంది వినతి పత్రం అందజేశారు. ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు బాబాగౌడ్, కోశాధికారి రాజేందర్ ఉన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని బోధన్, ఆర్మూర్ పట్టణాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్య్రం ఆయన చేసిన ప్రాణ త్యాగాన్ని ఈ సందర్భంగా నాయకులు గుర్తు చేశారు. – బోధన్/ఆర్మూర్‌టౌన్



ఎడపల్లిలో అల్లూరి సీతారామరాజు గురించి విద్యార్థులకు చెబుతున్న బీవీఎస్ నేతలు



బోధన్ పట్టణంలోని వివేకానంద స్కూల్లో..



ఆర్మూర్ పట్టణంలో బీజేపీ నేతలు నివాళులర్పిస్తూ..

యోగా ద్వారా ఏకాగ్రతపై దృష్టిసారించవచ్చు

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు ప్రతిరోజు సూపర్ బ్రెయిన్(గుంజీలు), యోగా ద్వారా ఏకాగ్రతపై దృష్టిసారించవచ్చని మెమోరీ ట్రెనర్ జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ విశ్రాంత అధికారి అందె జీవన్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని రాంమందిర్‌పాఠశాలలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో సూపర్ బ్రెయిన్ యోగా(గుంజీలు)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి రోజు ఉదయం 14 గుంజీలు తీసి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, మెదడు చురుకుగా పని చేస్తుందన్నారు. అనంతరం లయన్స్ సభ్యులు అందే జీవన్‌ను సన్మానించారు. హెచ్ఎం చలం, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మోహన్, తదితరులు పాల్గొన్నారు.



గుంజీలపై అవగాహన కల్పిస్తున్న అందె జీవన్

కు.ని ఆపరేషన్లు చేపట్టాలి



బాల్కొండ: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వారంలో ఒక రోజు కుటుంబ నియంత్రణ(కు.ని) ఆపరేషన్లు చేపట్టాలని డీఎంహెచ్‌వో సుదర్శనం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్యులకు పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలను పెంచాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. వైద్యులు అనిల్, శృతి, శ్రీకాంత్, సిబ్బంది తదితరులున్నారు.

తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ఆదిపురుష్ (3డీ–తెలుగు) - 12.20. 9.45 ; లవ్ యూ రామ్ - 4.05 నారాయణ అండ్ కో - 6.45
స్క్రీన్-2 –	ఎస్‌పీవై (తెలుగు) - 10.50. 1.45. 4.40. 07.35. 10.30
స్క్రీన్-3 –	సత్యప్రేమ్‌కీ కథ (హిందీ) - 10.00. 4.10. 10.20 సామజవరగమన - 1.10. 7.20
స్క్రీన్-4 –	ఈ నగరానికి ఏమైంది - 1.00 సామజవరగమన - 4.00 ఇండియానా జోన్స్ (తెలుగు) - 7.00 మాయపేటిక - 10.20

సంక్షిప్తం

7వ రోజుకు చేరిన రైతుల రిలే దీక్షలు

రెంజల్(బోధన్): రెంజల్ శివారులోని బందల్ల రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ రెంజల్ రైతులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 7వ రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమంలో హన్మాండ్లు(బుజ్జి), చుక్క రాజుగౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

రుద్రూర్: రుద్రూర్ ముదిరాజ్ సంఘం కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దార్ల సాయిలు, ఉపాధ్యక్షులుగా ఏముల గజేందర్, బైండ్ల సుదర్శన్, ఏముల అశోక్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.వెంకటి, సహాయ కార్యదర్శిగా మహిధర్, తదితరులను ఎనుకున్నారు.

బాల్కొండలో బీజేపీ బైక్ ర్యాలీ

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం మేరా బూత్ సబ్‌సే మజ్బూత్ కార్యక్రమం ముగింపు సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ బాల్కొండ ఇన్‌చార్జి శివకుమార్, పార్టీ జెండాను ఆవిష్కరించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు అంబటి నవీన్, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన తొండాకూర్ విద్యార్థులు

డొంకేశ్వర్(ఆర్మూర్): బాసర ట్రిపుల్ ఐటీకి తొండాకూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల పదవ తరగతి పాసైన ఐదుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీనివాస్ తెలిపారు. ఎస్ఆర్. భవానీ, ఎస్. గౌతమి, అనుస్పందన, శ్యామల, ఎం. నిషా విద్యార్థినులు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమన్నారు.

వీఆర్‌ఈసీలో ప్రాంగణ నియామకాలు

మాక్లూర్: మండలంలోని దాస్‌నగర్‌వద్ద గల విజయ్ రూరల్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ప్రాంగణ నియామకాలు జరిగాయి. కోడ్‌నెస్ట్ కంపెనీ నిర్వహించిన నియామకాల్లో కళాశాలకు చెందిన ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు శ్రావణ్, సంధ్య, శ్రీదత్త, ప్రవిక, హేమంత్‌లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కె నరేందర్‌రెడ్డి ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

నిజాంసాగర్ ఆయకట్టుకు సాగునీరందించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేత వడ్డీ మోహన్ రెడ్డి

ఖలీల్‌వాడి : నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలోని నవీపేట్, రెంజల్, ఎడపల్లి మండలంలోని వ్యవసాయ భూములకు సాగునీరు అందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు బోధన్ బీజేపీ నియోజకవర్గ నేత మోహన్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిజాంసాగర్ ఆయకట్టు కింద ఉన్న పంటలు వేసుకునేందుకు అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా గాని కాళేశ్వరం నీటి ద్వారా 30 టీఎంసీల నీటిని అందించాలని తెలిపారు. శైలేష్‌కుమార్, ఇంద్రకరణ్, సత్యనారయణ, ప్రసాద్ నవీన్, శంకర్, సతీష్ తదితరులు ఉన్నారు.